**మంచిమాట**

దేవాలయాలలో విగ్రహాలలోకాక నిరుపేదలలో బలహీనులలో ఆపన్నులలో భగవంతుడిని దర్శించేవారంటేనే దేవుడికి ఇష్టం. సాటిమనిషికి సాయం చేయనివాడు భగవంతుడిని బంగారుపూలతో పూజించినా వ్యర్థమే.


# DD9 వార్త

తెలుగు దినపత్రిక


## భయపెడుతోన్న వాతావరణ శాఖ

**హైదరాబాద్ :** తెలుగు రాష్ట్రాల్లో చలి తీవ్రత కొనసాగుతోం ది. గత రెండ్రోజులతో పోల్చితే ఇవాళ చలి తీవ్రత మరింత ఎక్కువగా ఉంది. తెలంగా ణలో చాలాచోట్ల సింగిల్ డిజిట్ టెంపరేచర్స్ నమోదయ్యా యి. సాధారణం కంటే నాలుగైదు డిగ్రీలు తక్కువగా ఉష్ణోగ్ర తలు నమోదవుతు న్నాయి. పటాన్‌చెరులో 7, ఆదిలాబాద్‌లో 7.2, మెదక్‌లో 8, రాజేంద్రనగర్‌లో 8.5, హనుమకొండలో 9.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యాయి. అలాగే, హైదరాబాద్‌లో 10.8, నిజామాబాద్‌లో 11.6, హయత్‌నగర్‌లో 12, రామగుండం లో 12, దుండిగల్‌లో 12.2, ఖమ్మంలో 13.4 , నల్గొండలో 13.6, మహబూబ్ నగర్‌లో 14.5, భద్రాచలంలో 15 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పొగమంచు కారణంగా ఇబ్బందులు పడుతున్నారు వాహనదారులు. రాబోయే రెండ్రోజుల్లో చలి తీవ్రత మరింత పెరగనుంది. హైదరాబాద్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలకు అలర్ట్ జారీచేసిన వాతావరణశాఖ.


www.dd9vaartha.com | సంపుటి : 01 సంచిక : 124 | ఆదివారం, డిసెంబర్ 21, 2025 , | పేజీలు - 06 | వెల : 3/-


## హైదరాబాద్ చేరుకున్న ఉపరాష్ట్రపతి



**హైదరాబాద్,డిసెంబర్ 20 :** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ హైదరాబాద్‌లో పర్యటిస్తున్నారు. ద్రౌపది ముర్ము ఇప్పటికే నగరానికి రాగా.. శనివారం సీపీ రాధాకృష్ణన్ చేరుకున్నారు. మధ్యాహ్న సమయంలో శంషాబాద్ విమానాశ్రయానికి ఆయన చేరుకోగా.. మంత్రి శ్రీధర్ బాబు, అధికారులు ఘనస్వాగతం పలికారు. నేడు జరిగే పబ్లిక్ మిగతా2లో...



## పశ్చిమబెంగాల్లో మహా జంగిల్ రాజ్

- చొరబాటుదారులకు అండగా మమత
- విరుచుకు పడ్డ ప్రధాని మోడీ

**కోల్‌కతా, 20 :** తృణమూల్ కాంగ్రెస్ సారథ్యంలోని పశ్చిమబెంగాల్ ప్రభుత్వంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. చొరబాటుదారులను కాపాడుకునేందుకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ను మమతా బెనర్జీ ప్రభుత్వం వ్యతిరేకిస్తోందని, బెంగాల్‌లో చొరబాటు దారులకు టీఎంసీ ప్రాపకం లభిస్తోందని విమర్శించారు. తహెర్‌పూర్‌లో శనివారం మిగతా2లో...

# ప్రేమించే గుణాన్ని పంచిన ఏసు ప్రభువు

- ఎల్బీనగర్ క్రిస్మస్ వేడుకల్లో సిఎం రేవంత్
- ఆజ్మీర్ దర్గాకు సిఎం ఛాదర్ సమర్పణ



**హైదరాబాద్,డిసెంబర్ 20 :** ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ఒకేసారి జరుపుకునే పండుగగా క్రిస్మస్.. ద్వేషించే వారికి కూడా ప్రేమించే గుణాన్ని ఏసు ప్రభువు మానవాళికి స్ఫూర్తిగా అందించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి కూడా డిసెంబర్ ఒక మిరాకిల్ మంత్‌గా మారిందని వ్యాఖ్యానించారు. రాజకీయంగా మిగతా2లో...

# ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలు డౌటే...



- కెసిఆర్ ఫీల్డ్‌లోకి రాకున్న అద్భుత ఫలితాలు
- తాండూరు నియోజకవర్గ సర్పంచ్‌లతో కెటిఆర్

**హైదరాబాద్,డిసెంబర్ 20 :** ప్రస్తుత పంచాయితీ ఫలితాలు చూశాక, ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలు పెడతారని అనుకోవడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సర్పంచ్ ఎన్నికల ఫలితాలు చూసి ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు పెడతారని అనుకోవడం లేదు.. పంచాయతీ ఎన్నికల ఫలితాల విషయంలో రేవంత్ రెడ్డి మీడియా సమావేశంలో ఐదు నిమిషాలకే మాట మార్చారు అని పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికల్లో కేసీఆర్ కాలు బయట పెట్టకపోయినా గులాబీ సైనికులు అద్భుతంగా పోరాడారు, ప్రభుత్వం భయపడే పరిస్థితి వచ్చింది అని కేటీఆర్ అన్నారు. తమకు ఉన్న హక్కులు, నిధులు, విధుల గురించి కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు తెలుసుకోవాలని కేటీఆర్ సూచించారు. రాజ్యాంగం ప్రకారం ఐదంచెల్లో ప్రభుత్వాలు ఉన్నాయని తెలిపారు. గ్రామ పంచాయతీలకు ఇచ్చే నిధులు సొంత ఆస్తులు, డబ్బులు కావని పేర్కొన్నారు. కమిషన్ ద్వారా జనాభా ప్రాతిపదికన నిధులు ఇస్తారని మిగతా2లో...

# ఉపాధిలో గాంధీ పేరు తొలగించడం దారుణం

- కేంద్రం తీరుపై మండిపడ్డ సోనియా



**న్యూఢిల్లీ,డిసెంబర్ 20 :** మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరును మార్చడంపై కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. ఈ పథకాన్ని నీరుగార్చేందుకు మోదీ ప్రభుత్వం దశాబ్దకాలంగా అనేక ప్రయత్నాలు చేసిందని ఆరోపించారు. ఇటీవల ఈ చట్టంలో ఏకపక్షంగా మార్పులు చేయడంతోపాటు దేశంలో కోట్లాదిమంది రైతులు, కార్మికులు, భూమిలేని వారి ప్రయోజనాలపై కేంద్ర ప్రభుత్వం దాడి చేసిందని మండిపడ్డారు. ఈ మేరకు సోనియా మిగతా2లో...



2లో

## విశాఖలో వాజ్‌పేయ్ విగ్రహావిష్కరణ

# ఉద్యోగ నియామకాల్లో జాప్యం తగదు

- జాబ్ క్యాలెండర్ ఉండాల్సిందే
- లేకుంటే యువత భవిష్యత్ దెబ్బతింటుంది
- తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్, 20 :** పబ్లిక్ సర్వీస్ కమిషన్లు దేశ పరిపాలనా వ్యవస్థకు వెన్నెముకలని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. న్యాయమైన, పారదర్శక నియామకాల ద్వారానే ప్రజాసేవలో ప్రతిభకు స్థానం ఉంటుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. రామోజీ ఫిల్మ్ సిటీలో ఏర్పాటు చేసిన 26వ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ల మిగతా2లో...

## కెసిఆర్ అధ్యక్షతన నేడు బీఆర్ఎస్ శాసనసభాపక్షం భేటీ

- నదీ జలాలు, సాగునీటి ప్రాజెక్టులపై ప్రధానంగా చర్చ
- ఇదే అంశంపై ఉద్యమ కార్యాచరణకు బిఆర్ఎస్ సిద్ధం
- మీడియాతో మాట్లాడి వివరాలు వెల్లడించనున్న కెసిఆర్



**హైదరాబాద్, 20 :** తెలంగాణ భవన్‌లో ఆదివారం బీఆర్ఎస్ శాసనసభాపక్షం, రాష్ట్ర కార్యవర్గం భేటీ కానుంది. పార్టీ అధినేత కేసీఆర్ నేతృత్వంలో నేతలు సమావేశం కానున్నారు. ఇందులో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొననున్నారు. నదీ జలాలు, సాగునీటి ప్రాజెక్టుల మిగతా2లో...

# ఆఫర్ల పేరుతో సైబర్ నేరాలు

- అప్రమత్తంగా ఉండాల్సిందే
- ప్రజలను హెచ్చరించిన సిపి సజ్జనార్



**హైదరాబాద్,డిసెంబర్ 20 :** ఏపీకే ఫైల్స్, ఓటీపీ, బ్యాంక్ ట్రాన్సిషన్ పై అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'బయట రాష్ట్రాల్లో ఉండి నిందితులు సైబర్ నేరాలకు పాల్పడు తున్నారు. వేరొక స్టేట్స్ లో ఉన్న నిందితుల్ని గుర్తించడం, డబ్బును రికవరీ చేయడం కష్టంగా మారింది. మిగతా2లో...

## పంచాయితీ ఎన్నికలపై కాంగ్రెస్ పోస్ట్‌మార్టమ్

- 16 మంది ఎమ్మెల్యేల పనితీరుపై ఆగ్రహం



**హైదరాబాద్,డిసెంబర్ 20 :** పంచాయతీ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ అధిష్ఠానం టెలికాన్ఫరెన్స్ నిర్వహించింది. సీఎం రేవంత్‌రెడ్డి , టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ తదితరులు సమావేశానికి హాజరయ్యారు. పంచాయతీ ఎన్నికల ఫలితాలపై చర్చించారు. ఇటీవలి ఫలితాలపై పోస్ట్మార్టమ్ నిర్వహించారు. రెబల్స్‌ను సమన్వయం చేయలేని ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులపై రేవంత్‌రెడ్డి, మహేశ్‌కుమార్ గౌడ్ అసహనం మిగతా2లో...

# పశ్చిమబెంగాల్లో మహా జంగిల్ రాజ్

(మొదటి పేజీ తరువాయి)

నాడు జరిగిన ర్యాలీని ఉద్దేశించి ఫోనులో ప్రధాని మాట్లాడుతూ, పశ్చిమబెంగాల్‌లో టీఎంసీ 'మహా జంగిల్ రాజ్'కు బీజేపీ చరమగీతం పాడుతుందని చెప్పారు. అవినీతి, ఆశ్రితపక్షపాతం, బుజ్జగింపు రాజకీయాలు రాష్ట్రాన్ని ఏలుతున్నాయని ఆరోపించారు. 'వాళ్లు బీజేపీని ఎంత గట్టిగానైనా వ్యతిరేకించనీయండి. కానీ పశ్చిమబెంగాల్ అభివృద్ధిని ఎందుకు అడ్డుకుంటున్నారో నాకయితే అర్థం కావడం లేదు. మీరు మోదీని వ్యతిరేకించండి, కానీ ప్రజల సంతోషాన్ని అడ్డుకోకండి. ప్రజల హక్కులను కాలరాయకండి. వారి కలలను చెల్లాచెదురు చేసే పాపానికి ఒడికట్టకండి. బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వమని పశ్చిమబెంగాల్ ప్రజలకు ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాను' అని మోదీ విజ్ఞప్తి చేశారు. కాగా, వాతావరణ ప్రతికూలత కారణంగా మోదీ హెలికాప్టర్ తహెర్‌పూర్‌లో దిగలేకపోయింది. దీంతో ఆయన కోల్‌కతా విమానాశ్రయానికి తిరిగి వెళ్లిపోయారు. పశ్చిమబెంగాల్‌లోని నదియా జిల్లా రణఘాట్‌లో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. వీటిలో రూ.3,200 కోట్లతో నిర్మించనున్న రెండు జాతీయ రహదారి ప్రాజెక్టులు కూడా ఉన్నాయి. ఈ ప్రాజెక్టులు కోల్‌కతాను సిలిగురితో అనుసంధానిస్తూ సుమారు రెండు గంటల ప్రయాణ సమయం ఆదా చేస్తాయని పీఎంఓ తెలిపింది. ఈ ప్రాజెక్టులతో ఆర్థిక కార్యకలాపాలు విస్తృతం కావడంతో పాటు పర్యాటకం కూడా పెరుగుతుందని పేర్కొంది.

# ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలు డౌటే...

(మొదటి పేజీ తరువాయి)

వివరించారు. బీఆర్ఎస్ హయాంలో్గ÷నాన్స్ కమిషన్ ద్వారా రూపాయి వస్తే.. మరో రూపాయి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిందని కేటీఆర్ తెలిపారు. గ్రామ పంచాయతీలకు పథకాలను ఆపే శక్తి ఎవరికీ లేదని స్పష్టం చేశారు. తాండూర్ నియోజకవర్గంలో నూతనంగా ఎన్నికైన బీఆర్ఎస్ సర్పంచ్‌లతో హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో కేటీఆర్ ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఈ ప్రభుత్వానికి ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పెట్టే దమ్ము లేదని కేటీఆర్ విమర్శించారు. మాకే నిధులు ఇవ్వడం లేదని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే డైరెక్ట్‌గా చెప్పిండని గుర్తుచేశారు. నిధులు ఇవ్వాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే వరల్డ్ బ్యాంకుకు లేఖ రాసిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న చోట అభివృద్ధి అనేది ఉండదని అన్నారు. కేసీఆర్ హయాంలో డంపింగ్ యార్డ్‌లు, ప్లలె ప్రకృతి వనాలు, క్రీడా మైదానాలు ఏర్పాటు చేశారని తెలిపారు. దీనివల్ల 21 జాతీయ పంచాయతీ అవార్డులను తెలంగాణ సాధించిందని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికలు గెలవడం సులభం.. కానీ పంచాయతీ ఎన్నికల్లో గెలవడమే కష్టమని కేటీఆర్ తెలిపారు. ఈ రెండేళ్లు మనకు కష్టంగా ఉంటుందని కొత్తగా ఎన్నికైన బీఆర్ఎస్ సర్పంచ్‌లతో అన్నారు. రేవంత్ సర్కార్ అన్ని వర్గాలను మోసం చేసిందని కేటీఆర్ విమర్శించారు. షాపుల యూరియా ఇవ్వనోడు.. యాప్‌ల యూరియా ఇస్తాడంట అని ఎద్దేవా చేశారు. 2014 నాటికి తెలంగాణ అప్పు రూ.72 వేల కోట్లుగా ఉందని తెలిపారు. 2023 నాటికి తెలంగాణ అప్పు రూ.మూడున్నర లక్షల కోట్లు అయ్యిందని అన్నారు. అంటే.. బీఆర్ఎస్ హయాంలో రూ.2.80 లక్షల కోట్ల అప్పు చేశారని వివరించారు. అంటే కేసీఆర్ చేసిన మొత్తం అప్పు రూ.2.80 లక్షల కోట్లే అని తెలిపారు. అదే రేవంత్ రెడ్డి అప్పు తెచ్చి ఏంచేసిండో చెప్పాలని డిమాండ్ చేశారు. త్వరలోనే మున్సిపల్ ఎన్నికలు రాబోతున్నాయని కేటీఆర్ తెలిపారు. తాండూరులో ఉండే 36 వార్డుల్లో ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు కోసం ఇప్పటి నుంచే కార్యాచరణ చేపట్టాలని అన్నారు.తాండూరు నియోజకవర్గం నూతన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్ వారిని సన్మానించారు. కాంగ్రెస్ ఎక్కడ ఉంటే అక్కడ ప్రోగ్రెస్ ఉండదు.. రెండేళ్లు మనకు కష్టాలు తప్పవు అని సెటైర్లు వేశారు. అయితే, కారు గుర్తు ఉండి, కేసీఆర్ గుర్తుకు వస్తే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోండి అని కేటీఆర్ తెలిపారు. రెండేళ్లు బీఆర్ఎస్ కు పరీక్ష కాలం.. కాంగ్రెస్ వాళ్లు ఏమైనా అంటే తలదించుకుని వెళ్లండి, రెండు అడుగులు వెనక్కు వెళ్లండి అని సూచించారు. పంచాయతీలకు డబ్బులు కేంద్ర ప్రభుత్వం నుంచి నేరుగా వస్తాయి, ఎవరి ప్రమేయం ఉండదన్నారు. బీఆర్ఎస్ సర్పంచులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వమని ఓ కాంగ్రెస్ ఎమ్మెల్యే అంటున్నారు.. ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్లు ఇలా అన్నింటి జాబితా పంచాయతీల్లో పెట్టాల్సిందే.. సర్పంచులు, పంచాయతీల చేతిలోనే ఉంటుంది.. నిధులు రావడం లేదని కాంగ్రెస్ ఎమ్మెల్యేలే చెప్తున్నారు.. కాంగ్రెస్ చేతిలో మోసపోని వారంటూ ఎవరూ లేరు, అందరూ బాధపడుతున్నారు.. జనవరి, ఫిబ్రవరిలో మున్సిపల్ ఎన్నికలు వస్తాయని అంటున్నారు.. ఇప్పటి నుంచే సిద్ధం కావాలి.. గ్రామీణ ప్రాంతాల వారికి మున్సిపల్ ఎన్నికల బాధ్యతలు అప్పగించండి అని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు.

# కెసిఆర్ అధ్యక్షతన నేడు బీఆర్ఎస్ శాసనసభాపక్షం భేటీ

(మొదటి పేజీ తరువాయి)

అంశంపై పోరుకు బీఆర్ఎస్ సిద్ధమవుతోంది. ఈ సమావేశంలో వీటిపై కేసీఆర్ ఉద్యమ కార్యాచరణ ప్రకటించనున్నట్లు సమాచారం. ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి తర్వాత గులాబీ బాస్, మాజీ సీఎం కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితమయ్యారు. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన సమావేశాలు, పార్టీ నేతలతో సమావేశాలను కూడా కేసీఆర్ అక్కడి నుంచే నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ రెండేళ్లలో కేసీఆర్ ప్రజలకు కనిపించింది చాలా అరుదనే చెప్పుకోవాలి. అయితే తెలంగాణ సాగునీటి హక్కుల రక్షణ కోసం కేసీఆర్ రంగంలోకి దిగనున్నారు. ఆదివారం తెలంగాణ భవన్‌కు బీఆర్ఎస్ అధినేత రానున్నారు.కేసీఆర్ అధ్యక్షతన రేపు మధ్యాహ్నం 2 గంటలకు బీఆర్ఎస్ఎల్పీ, రాష్ట్ర కార్యవర్గ సంయుక్త సమావేశం జరుగనుంది. నదీ జలాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంపై కేసీఆర్ సమరశంఖం పూరించనున్నారు. తెలంగాణ సాగునీటి హక్కుల రక్షణ కోసం మరో ప్రజా ఉద్యమంపై మాజీ సీఎం దిశానిర్దేశర చేయనున్నారు. బీఆర్ఎస్ఎల్పీ సమావేశం తర్వాత కేసీఆర్ మీడియాతో మాట్లాడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్ట్‌లో 45 టీఎంసీలకే కాంగ్రెస్ ప్రభుత్వం ఒప్పుకుందనేది బీఆర్ఎస్ వాదన. నదుల అనుసంధానం పేరుతో ఏపీ జలదోపిడీకి కేంద్రం సహకరిస్తోందని ఆ పార్టీ ఆరోపిస్తోంది. రాష్టాం÷-ర నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నా నోరు మెదపటం లేదని కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పరిస్థితి. కాంగ్రెస్, బీజేపీలను తెలంగాణ సమాజం ముందు దోషిగా నిలబెడతామని బీఆర్ఎస్ చెబుతోంది. మరోవైపు బీఆర్ఎస్ పార్టీ ప్రక్షాళనలపైనా కేసీఆర్ దృష్టి సారించారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు కేసీఆర్ ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా.. చాలా రోజుల తర్వాత తమ అధినేత తెలంగాణ భవన్‌కు రానుండటంతో పార్టీ శ్రేణుల్లో జోష్ నెలకొంది.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దూకుడు

**ప్రభాకర్ రావుపై విచారణ వేగవంతం**

**ఆధారాలు రాబల్లే యత్నాల్లో అధికారులు**




**హైదరాబాద్,డిసెంబర్ 20 :** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణ వేగం పెంచింది. ఈ కేసులో తెలంగాణ ప్రభుత్వం తాజాగా కొత్త ప్రత్యేక దర్యాప్తు బృందం ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. హైదరాబాద్ సీపీ సజ్జనార్ నేతృత్వంలో సిట్ విచారణ కొనసాగనుంది. కొత్తగా ఏర్పాటు చేసిన సిట్‌లో 9 మంది అధికారులు ఉన్నారు. ఈ నేపథ్యంలో సిట్ అధికారులు శనివారం నుంచి కీలక విచారణను ప్రారంభించారు. ఈ కేసులో కీలక నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు కస్టోడియల్ విచారణ గడువును మరో వారం రోజుల పాటు సుప్రీం కోర్టు పొడిగించింది. ఇందులో భాగంగా ప్రభాకర్ రావును పోలీసులు మళ్లీ జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి విచారణ చేపట్టనున్నారు.వారం రోజుల విచారణలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి సంబంధించిన కీలక నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని పోలీస్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ కేసుకు సంబంధించిన కీలక ఆధారాలు, మరికొందరి పాత్రపై స్పష్టత వచ్చే అవకాశం ఉండటంతో రాజకీయ, పరిపాలనా వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలో జూబ్లీహిల్స్ పీఎస్‌లో ప్రస్తుతం ప్రభాకర్ రావును సిట్ అధికారులు విచారిస్తున్నారు. ఈ కేసును సమగ్రంగా పరిశీలించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త సిట్‌ను నియమించగా.. ఆ బృందంతో శుక్రవారం హైదరాబాద్ సీపీ సజ్జనార్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేసు పురోగతి, విచారణ విధానం, సాంకేతిక అంశాలు, ఆధారాల సేకరణ వంటి పలు కీలక విషయాలపై సిట్ అధికారులకు సీపీ స్పష్టమైన దిశానిర్దేశర చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు శనివారం ఉదయం నుంచే పలువురు సిట్ అధికారులు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని విచారణ ప్రారంభించారు. అధికారులు ఈ వారం రోజుల పాటు ప్రభాకర్ రావును నిరంతరంగా ప్రశ్నించనున్నారు. సిట్ విచారణను సమర్థవంతంగా నిర్వహించేందుకు బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఒక రూమ్‌ను కేటాయించారు. అక్కడే కస్టోడియల్ విచారణ జరగనుంది. ప్రభాకర్ రావును ఈ నెల 25వ తేదీ వరకు కస్టడీలో ఉంచి విచారించేందుకు సుప్రీంకోర్టు అనుమతి లభించినట్లు సమాచారం. ఇప్పటికే ఈ కేసులో అరెస్టయిన ఇతర నిందితులను కూడా సిట్ అధికారులు పిలిపించి, ప్రభాకర్ రావు ఎదుటే ప్రశ్నిస్తున్నారు. గతంలో వారు ఇచ్చిన స్టేట్‌మెంట్లు, సాంకేతిక ఆధారాలు, డేటా విశ్లేషణ ఆధారంగా ప్రభాకర్ రావును సమగ్రంగా విచారిస్తున్నారు.ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పాత్ర పోషించిన వ్యక్తిగా భావిస్తున్న ప్రణీత్ రావుతో కలిపి కూడా ప్రభాకర్ రావును సిట్ అధికారులు ప్రశ్నించనున్నారు. వీరిద్దరి మధ్య జరిగిన సంభాషణలు, ఆదేశాలు, అమలైన విధానం, రాజకీయ నేతలు, ఇతరుల ఫోన్ల ట్యాపింగ్ అంశాలపై స్పష్టత కోసం అధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

# పంచాయితీ ఎన్నికలపై కాంగ్రెస్ పోస్ట్‌మార్టమ్

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. పంచాయతీ ఎన్నికల్లో సరిగా పనిచేయని 16 మంది ఎమ్మెల్యేలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా నల్లగొండలో ఎమ్మెల్యేల్లో సమన్వయ లోపం కనిపించిందని భావించారు. రెబల్స్‌తో సమన్వయ లోపం, బంధువులను అభ్యర్థులుగా నిలబెట్టడాన్ని తప్పుబట్టారు. పార్టీకి తీరని నష్టం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. వైఖరి మార్చుకుని పార్టీ నియమ నిబంధనలకు లోబడి పనిచేయాలని ఆదేశించారు. తెలంగాణలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ జయకేతనం ఎగురవేసింది.

మొదటి, రెండో విడతల్లో సుమారు 56 శాతం స్థానాలను గెలిచిన పార్టీ మూడో విడతలోనూ అదే ఆధిక్యాన్ని కొనసాగించింది. 31 జిల్లాల్లోని 12,733 పంచాయతీ సర్పంచి పదవులకు మూడు విడతల్లో ఎన్నికలు జరిగాయి.

ఇందులో 7,010 స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించింది.
3,502 స్థానాల్లో భారాస గెలుపొందింది. భాజపా 688 స్థానాలు పొందగా...
ఇతరులు 1,505 స్థానాల్లో గెలిచారు.
అయితే తమకు పట్టున్న కొన్ని చోట్ల స్థానాలను కోల్పోవడంపై కాంగ్రెస్ అధిష్ఠానం సీరియస్‌గా ఉంది. ఈక్రమంలోనే దానికి బాధ్యులైన ఎమ్మెల్యేలు, నియోజకవర్గ బాధ్యులతో సమావేశం నిర్వహించింది.

# ఉపాధిలో గాంధీ పేరు తొలగించడం దారుణం

(మొదటి పేజీ తరువాయి)

గాంధీ ఓ వీడియో మెసేజ్ రిలీజ్ చేశారు.సరిగ్గా 20 ఏళ్ల క్రితం మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ఉపాధి హామీ పథకాన్ని పార్లమెంటు ఏకాభిప్రాయంతో ఆమోదించిన విషయాన్ని సోనియా గాంధీ గుర్తుచేశారు. అదో విప్లవాత్మకమైన అడుగు అని.. అత్యంత పేదలు, అణగారినవారి జీవితాలకు ఆ పథకం ఉపాధి మార్గంగా నిలిచిందన్నారు. వలసలు ఆగిపోవడమే కాకుండా, ఉపాధికి హామీ దక్కిందన్నారు. మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు అనుగుణంగా తీసుకొచ్చిన ఆ పథకాన్ని మోదీ ప్రభుత్వం అణచివేసిందని ఆరోపించారు.గడిచిన 11 ఏళ్లుగా గ్రామీణ పేదల ప్రయోజనాలను విస్మరించిన కేంద్ర ప్రభుత్వం.. మహాత్ముడి పేరును తొలగించడమేగాక పథకం స్వరూపాన్నే మార్చిందని సోనియాగాంధీ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎలాంటి చర్చ లేకుండా, ఎవరినీ సంప్రదించకుండా, విపక్షాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా చట్టాన్ని మార్చివేయడం దారుణమని అన్నారు. దీనికి వ్యతిరేకంగా పోరాడేందుకు లక్షలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

# విశాఖలో వాజ్‌పేయ్ విగ్రహావిష్కరణ

**విశాఖపట్నం,డిసెంబర్ 20 :**భారత మాజీ ప్రధాని, దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయీ కాంస్య విగ్రహాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్ విశాఖపట్నంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ భాజపా అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మంత్రి సత్యకుమార్ యాదవ్, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. బైక్ ర్యాలీ నిర్వహించారు. వాజ్‌పేయ్ దార్శనికతను కొనియాడారు.

# ఆఫర్ల పేరుతో సైబర్ నేరాలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సైబర్ మోసాల కారణంగా హైదరాబాద్ ప్రజలు రోజుకు కోటి రూపాయలు నష్టపోతున్నారు. అలానే సైబర్ నేరగాళ్లు రెండు విధాలుగా నేరాలకు పాల్పడుతున్నారు. ఒకటి పెట్టుబడి పేరుతో మోసం చేస్తున్నారు.... రెండోవది డిజిటల్ అరెస్ట్ తో మోసం చేస్తున్నారని హెచ్చరించారు. డిజిటల్ అరెస్ట్ తో ఎక్కువగా వృద్ధులు, రిటైర్డ్ ఉద్యోగులు మోసపోతున్నారు. ప్రజలు సైబర్ కేటుగాళ్లు, వాళ్ల మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఏమైనా అనుమానాస్పద కాల్స్ వస్తే 1930 కి లేదా 100 కి కాల్ చేయాలన్నారు. రాబోయే పండుగలు సంక్రాంతి, క్రిస్మస్ సందర్భంగా సైబర్ నేరగాళ్లు ఆఫర్ల పేరుతో మోసాలకు పాల్పడే అవకాశం ఉంది. ఇక మధుర నగర్‌లో ట్రాఫిక్ సమస్యల నివారణకు త్వరలో చర్యలు కూడా తీసుకుంటాం. మధుర నగర్ పోలీస్ స్టేషన్ ను త్వరలోనే ప్రజలకి అనువుగా అందుబాటులో ఉండే ప్రాంతంలో ఏర్పాటు చేస్తాం' అని సజ్జనార్ వెల్లడించారు. ఫోన్ ట్యాపింగ్ కేసు పై కూడా సజ్జనార్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో సిట్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ కేసుల్లో ఇన్వెస్టిగేషన్ జరుగుతుందని, త్వరలో అన్ని వివరాలు తెలియజేస్తామని సజ్జనార్ వెల్లడించారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో అన్ని వివరాలు సేకరిస్తున్నామన్నారు. దీనికి సంబంధించి సిట్ కార్యాలయం విషయంలో ఆలోచన చేస్తున్నామని, ప్రస్తుతం జూబ్లీహిల్స్ పీఎస్ లోనే ఫోన్ ట్యాపింగ్ సంబంధించి విచారణ సాగుతుందని తెలిపారు. మరోవైపు ఐ బొమ్మ రవి కేసు గురించి అడిషనల్ సీపీ శ్రీనివాస్ పలు విషయాలను వెల్లడించారు. 'ఐ బొమ్మ రవి విచారణ జరుగుతుంది. సమాధానాలు చెప్పడంలేదని బయట ఊహాగానాలు వస్తున్నాయి. మా స్టైల్ లో మేము విచారణ చేస్తున్నాము. అతని నుండి సమాధానాలు రాబడుతున్నాం' అని ఆయన వెల్లడించారు.

# ప్రేమించే గుణాన్ని పంచిన ఏసు ప్రభువు

(మొదటి పేజీ తరువాయి)

భారీ మూల్యం చెల్లించి, ఆంధ్రప్రదేశ్‌లో పార్టీకి నష్టం జరిగినప్పటికీ సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రసాదించారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అయితే, గతంలో సోనియా గాంధీ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్‌ను తీసుకొచ్చి పేదలకు భరోసా కల్పించారని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఈరోజు తెలంగాణలో తమ ప్రభుత్వం పేదలకు దొడ్డు బియ్యం స్థానంలో సన్న బియ్యం అందిస్తున్నామని తెలిపారు. అలాగే, విద్య, వైద్యం లాంటి కీలక సేవలను ప్రభుత్వంతో సమానంగా క్రిస్టియన్ మిషనరీలు కూడా పేదలకు అందిస్తూ, సమాజ సేవలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ముఖ్యమంత్రి ప్రశంసించారు. క్రిస్మస్ పండుగ ప్రేమ, సేవ, త్యాగాలకు ప్రతీకగా నిలుస్తుంది.. ఆ విలువలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇదిలావుంటే అజ్మీర్ షరీఫ్ దర్గాకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చాదర్ సమర్పించారు. ఈ క్రాయక్రమంలో మంత్రులు అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, వేం నరేందర్ రెడ్డి,ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు, ఫహీం ఖురేషీ, తెలంగాణ హజ్ కమిటీ చైర్మన్ అఫ్జల్ బియాబని, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ, మైనారిటీ్గ÷నాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ముస్లిం మైనారిటీ నేతలు హాజరయ్యారు..

# ఉద్యోగ నియామకాల్లో జాప్యం తగదు

(మొదటి పేజీ తరువాయి)

జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. పరీక్షలకు వార్షిక జాబ్ క్యాలెండర్ తప్పనిసరని అన్నారు. ఉద్యోగ నియామకాల జాప్యం యువత భవిష్యత్తును దెబ్బతీస్తాయని.. ముందస్తు ప్రణాళికతోనే వారిలో విశ్వాసం పెరుగుతుందని చెప్పుకొచ్చారు. తెలంగాణ పీఎస్సీ విజయవంతంగా జాబ్ క్యాలెండర్ అమలు చేస్తోందని చెప్తూ కమిషన్ ఛైర్మన్, సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం తరపున అభినందించారు. పారదర్శకతే పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ప్రాణమని.. ప్రశ్నాపత్రాల తయారీ నుంచి తుది ఎంపిక వరకూ ప్రతి దశ స్పష్టంగా ఉండాలన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజ్‌లు ప్రజాసేవ విలువలకు విరుద్ధమని.. వాటిని కట్టడి చేసేందుకు ఆధునిక భద్రతా వ్యవస్థలు, నైతిక శిక్షణ అవసరమని సూచించారు. రిజర్వేషన్లు సంఖ్యలకే కాదని, వాస్తవిక ఫలితాలు ఇవ్వాలంటూ డిప్యూటీ సీఎం భట్టి చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమానికి ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు, పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ బుర్రా వెంకటేశం హాజరయ్యారు.

# హైదరాబాద్ చేరుకున్న ఉపరాష్ట్రపతి

(మొదటి పేజీ తరువాయి)

సర్వీస్ కమిషనర్ల ముగింపు సదస్సులో ఉప రాష్ట్రపతి పాల్గొనున్నారు. మరోవైపు శీతాకాల విడిది కోసం వచ్చిన రాష్ట్రపతి.. రామోజీ ఫిల్మ్‌సిటీలో జరిగిన పబ్లిక్ సర్వీస్ కమిషన్(పీఎస్సీ) ఛైర్‌పర్సన్ల జాతీయ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈరోజు గచ్చిబౌలిలో బ్రహ్మ కుమారిస్ శాంతి సర్వోవర్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, మంత్రి సీతక్క రాష్ట్రపతి ముర్ముకి ఘనస్వాగతం పలికారు. బ్రహ్మ కుమారిస్ 21వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె మొక్కలు నాటారు. కాగా, రెండ్రోజుల పర్యటన సందర్భంగా నేడు హైదరాబాద్‌కు చేరుకున్న ఉపరాష్ట్రపతి.. నేరుగా రామోజీ ఫిల్మ్ సిటీకి వెళ్లనున్నారు. అక్కడ నిర్వహిస్తున్న జాతీయ స్థాయి పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ఛైర్‌పర్సన్ల సమావేశ ముగింపు సెషన్‌లో ముఖ్య అతిథిగా పాల్గొనున్నారు. ఈ కార్యక్రమం రాజ్‌భవన్‌కి వెళ్లి రాత్రికి అక్కడే బస చేయనున్నారు. ఆదివారం ఉదయం శ్రీ రామచంద్ర మిషన్, హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కన్హా శాంతి వనంలో నిర్వహించే వరల్డ్ మెడిటేషన్ డే కార్యక్రమానికి ఆయన హాజరవుతారు. అనంతరం ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ నేరుగా ఢిల్లీకి బయలుదేరుతారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి పర్యటనల నేపథ్యంలో తెలంగాణ, హైదరాబాద్ పోలీసులు భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు.

# రబీ సీజన్‌లో రైతులకు యూరియా సరఫరా సులభతరం

**- ప్రత్యేక మొబైల్ యాప్‌ను ప్రవేశపెట్టిన ప్రభుత్వం**

**- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**

**కామారెడ్డి, డిసెంబర్ 20(డిడి9 వార్త):** రబీ సీజన్ ప్రారంభం నేపథ్యంలో రైతులకు యూరియా పంపిణీ, అమ్మకాలను మరింత సులభతరం చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక మొబైల్ యాప్‌ను ప్రవేశపెట్టిందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. ఈ యాప్‌ను డిసెంబర్ 22 నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అమలు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫర్టిలైజర్ బుకింగ్ యాప్‌పై వ్యవసాయ శాఖ అధికారులు, డీలర్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతువేదికల ద్వారా యాప్‌పై రైతులకు అవగాహన కల్పించాలని, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ యాప్ ద్వారా రైతులు ఎరువుల దుకాణాల వద్ద గంటల తరబడి క్యూలలో నిలబడాల్సిన అవసరం ఉండదని, తమకు నచ్చిన డీలర్‌ను ఎంపిక చేసుకుని ఇంటి నుంచే యూరియాను బుక్ చేసుకునే అవకాశం కల్పించబడిందని తెలిపారు. భూమి విస్తీర్ణాన్ని ఆధారంగా చేసుకుని సమీప డీలర్‌తో పాటు జిల్లాలోని ఏ ఇతర డీలర్ వద్దనైనా యూరియాను బుక్ చేసుకోవచ్చని అన్నారు. అలాగే డీలర్ల వద్ద అందుబాటులో ఉన్న యూరియా స్టాక్ వివరాలను కూడా యాప్ ద్వారా తెలుసుకోవచ్చని చెప్పారు. యూరియా బుకింగ్ పూర్తయ్యాక రైతు మొబైల్ ఫోన్‌కు ప్రత్యేక బుకింగ్ ఐడీ పంపబడుతుందని, ఆ ఐడీ ఆధారంగా సంబంధిత డీలర్ వద్ద యూరియాను పొందవచ్చని వివరించారు. ఈ యాప్‌ను టోకెన్ స్కానర్ ద్వారా స్కాన్ చేసి వినియోగంలోకి తీసుకురావచ్చని, వినియోగంలో సందేహాలు ఉంటే డీలర్ పాయింట్ల వద్ద ఉన్న వాలంటీర్లను సంప్రదించవచ్చని



పాస్‌బుక్ నంబర్, సంబంధిత సీజన్‌లో సాగు చేసే పంటల విస్తీర్ణం ఆధారంగా యూరియాను బుక్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. పట్టాదార్ పాస్‌బుక్ లేని కౌలు రైతులు ఆధార్ నంబర్ ద్వారా కూడా యూరియాను బుక్ చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. రైతులకు అవసరమైన మేరకు యూరియా బస్తాలను 15 రోజుల వ్యవధిలో ఒకటి నుంచి నాలుగు దశల్లో సరఫరా చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ యాప్‌ను రైతులు విస్తృతంగా డౌన్‌లోడ్ చేసుకునేలా అధికారులు



సూచించారు. "ఫర్టిలైజర్ బుకింగ్ యాప్" పేరుతో గూగుల్ ప్లే స్టోర్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ యాప్‌లో రైతులు, డిపార్ట్మెంటల్ అధికారులు, డీలర్లకు వేర్వేరు లాగిన్ సౌకర్యాలు ఉంటాయని చెప్పారు. రైతులు పట్టాదార్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావే శంలో వ్యవసాయ శాఖ అధికారులు, ఫ్యాక్స్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాంగ్‌రూట్‌లో వస్తే బండి సీజ్. తెలంగాణలో 'అరైవ్ అలైవ్' స్పెషల్ డ్రైవ్

**- తెలంగాణలో పెరిగిపోతున్న రోడ్డు ప్రమాదాలు**

**- రాష్ట్రంలో రోజూ సగటున 20 మంది మృతి**

**- 'అరైవ్.. అలైవ్' పేరుతో పోలీసుల ప్రత్యేక కార్యక్రమం**

**- హైవేలపై రాంగ్ రూట్‌లో వస్తే వాహనం అక్కడికక్కడే సీజ్**




తెలంగాణలో రహదారి భద్రత తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిరోజూ సగటున 74 ప్రమాదాలు జరుగుతుండగా, సుమారు 20 మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ గణాంకాలు రాష్ట్రంలో నెలకొన్న భయానక పరిస్థితికి అద్దం పడుతున్నాయి. వాహనదారుల నిర్లక్ష్యం, నిబంధనల ఉల్లంఘనే ఈ ప్రమాదాలకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. గతేడాది రోజుకు సగటున 52 వేల ట్రాఫిక్ ఉల్లంఘనలు నమోదు కాగా, ఈ ఏడాది ఆ సంఖ్య 72 వేలకు చేరడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ఈ ప్రమాద ఘంటికల నేపథ్యంలో తెలంగాణ పోలీసు శాఖ కఠిన చర్యలకు ఉపక్రమించింది. కేవలం జరిమానాలతో మార్పు సాధ్యం కాదని భావించి, నిబంధనలను కఠినతరం చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా 'అరైవ్.. అలైవ్' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా భారీ అవగాహన కార్యక్రమాలను ప్రారంభించింది. అతివేగం, సిగ్నల్ జంపింగ్, మద్యం తాగ

# కామారెడ్డి జిల్లా జిఆర్ కాలనీలో మాక్ ఎక్సర్‌సైజ్‌పై సమీక్ష

**- జిల్లా అధికారులతో అదనపు కలెక్టర్ విక్టర్ సమావేశం**








**కామారెడ్డి,డిసెంబర్ 20(డిడి9 వార్త):** కామారెడ్డి జిల్లా జిఆర్ కాలనీలో నిర్వహించనున్న మాక్ ఎక్సర్‌సైజ్ కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆదేశాల మేరకు శనివారం అదనపు కలెక్టర్ (రెవిన్యూ) విక్టర్ జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ జిఆర్ కాలనీలో పర్యటించి, విపత్తుల సమయంలో ఎదురయ్యే సమస్యలు, వాటికి తీసుకోవాల్సిన పరిష్కారాలపై అధికారులకు వివరించారు. ముఖ్యంగా 22.12.2025 (సోమవారం) ఉదయం 8.30 గంటలకు జిఆర్ కాలనీలో నిర్వహించనున్న మాక్ ఎక్సర్‌సైజ్‌కు సంబంధించిన ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహణకు వివిధ శాఖల అధికారులకు బాధ్యతలు కేటాయించినట్లు తెలిపారు. సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌ను సేఫ్టీ ఆఫీసర్‌గా, జిల్లా రెవిన్యూ అధికారిని డిప్యూటీ ఇన్సిడెంట్ కమాండర్‌గా, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌ను ఆపరేషన్ సెక్షన్ చీఫ్‌గా, సబ్ కలెక్టర్‌ను ప్లానింగ్ సెక్షన్ చీఫ్‌గా, రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్‌ను లాజిస్టిక్స్ సెక్షన్ చీఫ్‌గా నియమించారు. అలాగే జిల్లా పౌర సంబంధాల అధికారికి ఇన్ఫర్మేషన్ అండ్ మీడియా ఆఫీసర్ బాధ్యతలు అప్పగించారు. 22.12.2025న జరగనున్న ఈ మాక్ ఎక్సర్‌సైజ్ కార్యక్రమానికి అన్ని జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని, ఇన్సిడెంట్ కమాండర్ హోదాలో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) కలెక్టర్ ఆదేశాల మేరకు తెలియజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, గతంలో సంభవించిన భారీ వర్షాలను దృష్టిలో పెట్టుకొని, పెద్ద చెరువుల సమీపంలో అకస్మాత్తుగా భారీ వరదలు సంభవించిన సందర్భాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఫైర్ సర్వీస్, మునిసిపల్ శాఖతో పాటు వివిధ జిల్లా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రైతువేదిక సమావేశంలో ఫర్టిలైజర్ బుకింగ్ యాప్పై అవగాహన.



బజార్ హత్నూర్ మండలంలోనిబజార్హత్నూర్రైతువేదికలలోవ్యవసాయవిస్తరణఅధికారి సంతోష్ రైతులతో శనివారం రోజు సమావేశం అయ్యారు. రబీపంటలు సాగులోఫర్టిలైజర్ యాప్ లో యూరియా బుకింగ్‌చేసుకొనుటకు ఏవిదంగా యాప్ను ఓపెన్ చేసి బుక్‌చేసుకోవాలనే విషయం పైఅవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణఅధికారులుశ్రీకాంత్, సంతోష్,భోజన్న తదితరులు పాల్గొన్నారు.

# ఫుడ్ సేఫ్టీపై రిజిస్ట్రేషన్, లైసెన్స్ మేళ

**- ఈ నెల 22న జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహణ**

మారెడ్డి జిల్లాలోని అన్ని ఆహార వ్యాపార నిర్వాహకులు తప్పనిసరిగా ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్ పొందాలని ఫుడ్ సేఫ్టీ డిజిగ్నేటెడ్ ఆఫీసర్ శిరీష తెలిపారు. ఈ మేరకు ఈ నెల 22వ తేదీ సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని రూమ్ నెంబర్%-%25లో ఉదయం 11.00 గంటలకు ఫుడ్ సేఫ్టీ రిజిస్ట్రేషన్ మరియు లైసెన్స్ మేళను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇప్పటి వరకు లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్ పొందని ప్రతి ఆహార వ్యాపార నిర్వాహకుడు అవసరమైన పత్రాలతో హాజరై లైసెన్స్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ లేకుండా ఆహార వ్యాపారం నిర్వహిస్తే చట్టప్రకారం రూ.5 లక్షల వరకు జరిమానాతో పాటు ఆరు నెలల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. కావున ప్రతి ఆహార వ్యాపార నిర్వాహకుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్ కోసం ఆధార్ కార్డు జిరాక్స్, గ్రామ పంచాయతీ లేదా మునిసిపల్ లైసెన్స్ జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజు ఫోటో, కరెంట్ బిల్, జీఎస్టీ లైసెన్స్ (ఉన్నట్లయితే) తప్పనిసరిగా తీసుకుని రావాలని తెలిపారు.

# జాతీయ విజేతలకు ఆర్థిక సహాయం


**- గోల్డ్ మెడల్ సాధించిన క్రీడాకారులకు రూ.25 వేల చెక్కులు అందజేత**

**- ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**



**కామారెడ్డి,డిసెంబర్ 20(డిడి9 వార్త):** కామారెడ్డి జిల్లాకు జాతీయ స్థాయిలో కీర్తిప్రతిష్ఠలు తీసుకొచ్చిన క్రీడాకారులకు జిల్లా పాలన ఆర్థిక సహాయం అందజేసింది. జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో గోల్డ్ మెడల్స్ సాధించిన గోతి పరశురం, కిన్నెరా ఆనంద్, మలవాత్ ఈశ్వర్‌లకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఒక్కొక్కరికి రూ.25,000 చొప్పున చెక్కులను శనివారం తన ఛాంబర్‌లో అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్స్ సాధించి కామారెడ్డి జిల్లాకు తీసుకొచ్చిన గౌరవం అపూర్వమని కొనియాడారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ పట్టుదలతో శ్రమించి సాధించిన ఈ విజయాలు జిల్లాలోని యువతకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఇదే ఉత్సాహంతో భవిష్యత్తులో జాతీయ స్థాయితో పాటు అంతర్జాతీయ స్థాయిలో కూడా విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. క్రీడల్లో విజయం సాధించాలంటే క్రమశిక్షణ, నిరంతర సాధన, ఆత్మవిశ్వాసం ఎంతో అవసరమని కలెక్టర్ తెలిపారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించేందుకు జిల్లా పాలన ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. జిల్లాలో క్రీడా రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నామని, క్రీడా మైదానాల అభివృద్ధి, శిక్షణా సదుపాయాలు, కోచింగ్, క్రీడా సామగ్రి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భవిష్యత్తులో మరింత మంది ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ఆర్థిక సహాయం, ప్రోత్సాహకాలు అందించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాశాఖ అధికారి రంగ వేంకటేశ్వర గౌడ్, అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, సెక్రటరీ అనిల్, క్రీడాకారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొని విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఎరాజ్‌పల్లి పాఠశాలలో నిఘంటువుల పంపిణీ




**బోధన్, నిజామాబాద్ జిల్లా డిసెంబర్ 20 (డీడీ9 వార్త):** విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని 'మేముసైతం' స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు డా.నవీన్ కుమార్ ఆకాంక్షించారు. శనివారం బోధన్ మండల పరిధిలోని ఎరాజ్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిఘంటువులను పంపిణీ చేశారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులందరికీ వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఆంగ్ల పదాలపై పట్టు సాధించేందుకు ఈ నిఘంటువులు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు పేరు తీసుకురావాలని కోరారు. గత 15 ఏళ్లుగా తమ సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, భవిష్యత్తులోనూ పాఠశాల అభ్యున్నతికి తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రేమలత మాట్లాడుతూ.. విద్యార్థుల విద్యాభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కాట్రగడ్డ భారతి, ఉదయలక్ష్మి, శ్రీలక్ష్మి, సునీత, యామిని, చంద్రశేఖర్, సంస్థ ప్రతినిధులు నితిన్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి 'సన్నాయి మేళం' విరాళం



**బోధన్, నిజామాబాద్ జిల్లా డిసెంబర్ 20 (డీడీ9 వార్త) :** ఎడపల్లి మండలం జానకంపేట్ లోని ప్రసిద్ధ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానానికి బోధన్ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఈ.సాయి శివ శనివారం ఎలక్ట్రానిక్ సన్నాయి మేళం పరికరాన్ని విరాళంగా అందజేశారు. దేవాలయ సందర్శనకు విచ్చేసిన ఆయనకు ఆలయ మర్యాదల ప్రకారం ఘనస్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు న్యాయమూర్తికి స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి, తీర్థప్రసాదాలను అందజేసి ఘనంగా సన్మానించారు. దేవాలయాల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూనే, సంప్రదాయబద్ధమైన ధ్వనిని వినిపించేలా ఈ ఎలక్ట్రానిక్ సన్నాయి మేళం ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## బోధన్ మారుతి మందిరం దుకాణం వేలం వాయిదా



**బోధన్, నిజామాబాద్ జిల్లా డిసెంబర్ 20 (డీడీ9 వార్త) :** బోధన్ పట్టణంలోని శ్రీ మారుతి మందిరం దుకాణ సముదాయంలో గల ఒకటో నంబరు దుకాణానికి సంబంధించి శనివారం నిర్వహించాల్సిన లీజు లైసెన్స్ వేలం పాట వాయిదా పడింది. రెండు సంవత్సరాల కాలపరిమితికి గాను ఈ వేలం నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అయితే, నిర్ణీత సమయానికి పాటాదారులు (బిడ్డర్లు) ఎవరూ రానందున వేలం ప్రక్రియను వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. తదుపరి వేలం నిర్వహించే తేదీని త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ కమల, ఆలయ అర్చకులు ప్రవీణ్ శర్మ, మధుసూదన్, సిబ్బంది సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## 'మీ డబ్బు.. మీ హక్కు'ను వినియోగించుకోండి

**: - జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్**



**నిజామాబాద్, డిసెంబర్ 20 (డీడీ9 వార్త) :** వివిధ కారణాల వల్ల బ్యాంకులు, ఆర్థిక సంస్థల్లో క్లెయిమ్ చేయకుండా నిలిచిపోయిన నగదు, ఇతర ఆస్తులను తిరిగి పొందేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మీ డబ్బు.. మీ హక్కు' కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్ కోరారు. శనివారం కలెక్టరేట్‌లో ఈ ప్రత్యేక అవగాహన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత ప్రభుత్వ ఆదేశాల మేరకు నవంబరు 1 నుంచి డిసెంబరు 31 వరకు ఈ ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు తాము మర్చిపోయిన లేదా క్లెయిమ్ చేయని బ్యాంకు డిపాజిట్లు, షేర్లు, డివిడెండ్లు, మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులు, బీమా రాబడులను తిరిగి పొందేందుకు ఇది సువర్ణ అవకాశమని పేర్కొన్నారు. పదేళ్లకు పైగా బ్యాంకుల్లో క్లెయిమ్ చేయకుండా ఉన్న డిపాజిట్ల వివరాలను ఆర్‌బీఐకి చెందిన 'ఉద్గమ్' వెబ్‌సైట్‌లో సులభంగా చూసుకోవచ్చని అదనపు కలెక్టర్ వివరించారు. అర్హులైన వారు తగిన ధ్రువీకరణ పత్రాలతో సంబంధిత బ్యాంకులు, ఆర్థిక సంస్థలను సంప్రదించి తమ నిధులను క్లెయిమ్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఐ ఎల్‌డీఓ రాములు, ఎస్ఎల్‌సీ మేనేజర్ ప్రకాష్, ఎస్‌బీఐ ఆర్ఎం మహేశ్వర్, ఏజీఎం రవికిరణ్, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌కు రెడ్ క్రాస్ బృందం అభినందనలు




**నిజామాబాద్, డిసెంబర్ 20 (డీడీ9 వార్త) :** నిజామాబాద్ జిల్లాలో మూడు విడతల గ్రామ పంచాయతీ ఎన్నికలను అత్యంత పకడ్బందీగా, దిగ్విజయంగా నిర్వహించినందుకుగాను జిల్లా పాలనాధికారి, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు వినయ్ కృష్ణ రెడ్డిని రెడ్ క్రాస్ బృందం ఘనంగా అభినందించింది. శనివారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ బుస్స ఆంజనేయులు నేతృత్వంలోని బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఆయనకు పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లాలో రెడ్ క్రాస్ సంస్థ చేపడుతున్న వివిధ సేవా కార్యక్రమాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సంస్థ సామాజిక సేవలో ముందుండటంపై ఆయన హర్షం వ్యక్తం చేస్తూ బృందాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట రాజశేఖర్, కోశాధికారి కరిపే రవీందర్, జూనియర్ రెడ్ క్రాస్ సమన్వయకర్త అబ్బాపూర్ రవీందర్, పి.ఆర్.ఓ బొద్దుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## క్లెయిమ్ చేయని ఆర్థిక ఆస్తుల సెటిల్‌మెంట్‌కు ప్రత్యేక ప్రచారం

**- "మీ డబ్బు మీ హక్కు"ను సద్వినియోగం చేసుకోవాలి**
**- జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్**










**కామారెడ్డి,డిసెంబర్ 20(డిడి9 వార్త):** క్లెయిమ్ చేయని ఆర్థిక ఆస్తుల పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక జాతీయ స్థాయి ప్రచారాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్ పిలుపునిచ్చారు. ఈ ప్రచారంలో భాగంగా శనివారం కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోని సమావేశ మందిరంలో ఉదయం 10.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు నిర్వహించిన ప్రత్యేక అవగాహన మరియు సేవల శిబిరానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆర్థిక సేవల విభాగం, ఆర్థిక మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వ ఆదేశాల మేరకు 01.10.2025 నుండి 31.12.2025 వరకు "మీ డబ్బు %-% మీ హక్కు" అనే నినాదంతో జాతీయ స్థాయి ప్రచారం నిర్వహించబడుతోందని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రచారం ద్వారా పౌరులు తమకు చెందవలసిన క్లెయిమ్ చేయని బ్యాంక్ డిపాజిట్లు, షేర్లు, డివిడెండ్లు, మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులు, బీమా రాబడులు తదితర ఆర్థిక ఆస్తులను తిరిగి క్లెయిమ్ చేసుకునే అవకాశం కల్పించబడుతుందని చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అన్‌క్లెయిమ్ చేయని ఆర్థిక ఆస్తులపై హక్కు కలిగిన వారు అవసరమైన పత్రాలతో సంబంధిత బ్యాంకులు లేదా ఆర్థిక సంస్థలను సంప్రదించి తమ నిధులను తిరిగి పొందాలని సూచించారు. అలాగే, భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఆధ్వర్యంలోని యూడిజిఏయమ్ పోర్టల్ ద్వారా అన్‌క్లెయిమ్ డిపాజిట్ల వివరాలను తెలుసుకొని సులభంగా సెటిల్‌మెంట్ పొందవచ్చని వివరించారు. ఈ ప్రత్యేక ప్రచారాన్ని ప్రజలు తప్పనిసరిగా వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్. ప్రవీణ్ కుమార్ (డిడియమ్ %-% నాబార్డ్), అనుపమ (జియమ్ %-% యాన్డిసీసీ బ్యాంక్), మనీష్ సైనీ (డియమ్ %-% కెనరా బ్యాంక్), జె. చంద్రశేఖర్ (ఎల్డియమ్ %-% కామారెడ్డి), ఎస్‌బీఐ, ఎస్ఎల్‌బీసీ తెలంగాణ తరఫున డీఎం వరప్రసాద్ పాల్గొని ప్రసంగించారు. శిబిరంలో నాబార్డు, ఎస్ఎల్‌బీసీ, ఎల్ఐసీతో పాటు వివిధ బ్యాంకుల అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. పాల్గొన్న సంస్థలు ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేసి వినియోగదారులకు ప్రత్యక్ష సేవలు అందించాయి. ఈ సందర్భంగా అర్హులైన నిజమైన హక్కుదారులకు సెటిల్‌మెంట్ లెటర్లు కూడా జారీ చేశారు.

## ముగిసిన పార్లమెంట్ శీతాకాల సమావేశాలు కీలక బిల్లులు ఆమోదం



**(డిడి9 వార్త)**పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నేటితో ముగిశాయి. లోక్‌సభ నిరవధిక వాయిదా పడింది. డిసెంబర్ 1వ తేదీన సమావేశాలు మొదలయ్యాయి. 19వ తేదీ ) వరకు కొనసాగాయి. మొత్తం 15 రోజుల పాటు సమావేశాలు జరిగాయి. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు వాడీ వేడిగా సాగాయి. సమావేశాల సందర్భంగా లోక్‌సభ పలు కీలక బిల్లులకు ఆమోదం తెలిపింది.లోక్ సభ ఆమోదం తెలిపిన కీలక బిల్లులు.. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో 'వీబీ జీ రామ్ జీ' పేరుతో తీసుకువచ్చిన బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది.అణు ఇంధన రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ఆహ్వానించేందుకు ఉద్దేశించిన శాంతి బిల్లును పార్లమెంట్ ఆమోదించింది. సస్టెయినబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా(శాంతి) బిల్లును మూజువాణి ఓటుతో రాజ్యసభ ఆమోదించింది.బీమా రంగంలో విదేశీ పెట్టుబడుల పరిమితిని 100 శాతానికి పెంచే బీమా సవరణ బిల్లును ప్రతిపక్షాల నిరసనల మధ్యే లోక్‌సభ ఆమోదించింది.

మణిపూర్ గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్(రెండవ సవరణ)బిల్లు 2025 కి లోక్ సభ ఆమోదం తెలిపింది.

సెంట్రల్ ఎక్సైజ్ (సవరణ) బిల్లు 2025.

నేషనల్ సెక్యూరిటీ సెస్ బిల్లు 2025.

సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్ బిల్లు 2025.

ఉన్నత విద్యా కమిషన్ బిల్లు 2025.

జన్ విశ్వాస్(నిబంధనల సవర) బిల్లు.

దివాళా, దివాళా కోడ్ (సవరణ) బిల్లు.

పారదర్శకంగా భూసేకరణ కోసం జాతీయ రహదారుల(సవరణ) బిల్లు.కంపెనీల చట్టం సవరించడానికి కార్పొరేట్ చట్టాలు(సవరణ) బిల్లులకు లోక్ సభ ఆమోదం తెలిపింది.

## జర్నలిస్టులకు త్వరలో అక్రిడిటేషన్ కార్డులు




**(డిడి9 వార్త)**జర్నలిస్టుల చిరకాల వాంఛలైన అక్రిడిటేషన్ కార్డులు, ఇళ్ల స్థలాల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్ ఆర్ కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ జిల్లా మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరుకావాల్సి ఉంది. అయితే అనివార్య కారణాల వల్ల అత్యవసరంగా హైదరాబాద్ వెళ్లాల్సి రావడంతో మంత్రి ఫోన్ ద్వారా జర్నలిస్టులను ఉద్దేశించి ప్రసంగించారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకోబోయే కీలక నిర్ణయాలను ఈ సందర్భంగా వివరించారు.

**త్వరలో అక్రిడిటేషన్ కార్డులు :**

రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదురుచూస్తున్న అక్రిడిటేషన్ కార్డుల ప్రక్రియ తుది దశకు చేరుకుందని మంత్రి పొంగులేటి తెలిపారు. రాబోయే పది రోజుల్లోనే దీనికి సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు () విడుదల చేస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్డులు అందేలా చర్యలు తీసుకుంటామని ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు.

**ఇళ్ల స్థలాలపై స్పష్టత :**

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఇప్పటికే లోతుగా చర్చించామని మంత్రి పేర్కొన్నారు. గతంలో సుప్రీంకోర్టు ఉత్తర్వులు, న్యాయపరమైన చిక్కుల వల్ల కొంత ఆలస్యమైందని అయితే వాటన్నింటినీ అధిగమించి వచ్చే ఏడాది జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల విషయంలో ప్రభుత్వం తరఫున తీపి కబురు అందిస్తామని ప్రకటించారు. జర్నలిస్టుల ఆత్మగౌరవాన్ని కాపాడటం తమ ప్రభుత్వ బాధ్యతని ఆయన ఉద్ఘాటించారు.

**సమిష్టిగా ముందుకు సాగాలి :**

టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా మహాసభలు ఘనంగా నిర్వహించుకోవడం పట్ల మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల హక్కుల కోసం పోరాడుతున్న సంఘం నాయకులను, సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర, జిల్లా స్థాయి ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

## నిజామాబాద్ 'బోధన్ రోడ్డు'పై మృత్యుపాశం

**- ఎన్.ఎన్ ప్యాలెస్ వద్ద మూడేళ్లలో 19 మంది దుర్మరణం..**
**- రాష్ట్రంలో 20వ 'బ్లాక్ స్పాట్'గా గుర్తింపు**
**- క్షేత్రస్థాయిలో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి పరిశీలన**



**నిజామాబాద్, డిసెంబర్ 20 (డీడీ9 వార్త) :** ఆ రోడ్డుపై ప్రయాణమంటేనే జనం హడలిపోతున్నారు. ఎప్పుడు ఏ మలుపు నుంచి మృత్యువు కబళిస్తుందోనని భయాందోళన చెందుతున్నారు. నిజామాబాద్ జిల్లా బోధన్ రోడ్డులోని ఎన్.ఎన్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్ ప్రాంతం ఇప్పుడు మరణాల అడ్డాగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రమాదకరంగా మారిన రోడ్ల జాబితాలో ఈ ప్రాంతం ఏకంగా 20వ స్థానంలో నిలవడం ఇక్కడి పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. శనివారం జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులతో కలిసి ఈ మృత్యు ప్రాంతాన్ని (బ్లాక్ స్పాట్) సందర్శించారు. గత మూడు సంవత్సరాల కాలాన్ని పరిశీలిస్తే.. ఈ ఒక్క ప్రాంతంలోనే రోడ్డు ప్రమాదాల కారణంగా 19 మంది నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. మృతుల్లో ఎక్కువ మంది పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారే ఉండటం తీరని విషాదం. అతివేగం ఒక కారణమైతే, రోడ్డు మలుపుల వద్ద సరైన భద్రతా ప్రమాణాలు లేకపోవడం మరో ప్రధాన కారణమని కలెక్టర్ గుర్తించారు. యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కలెక్టర్ అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..: మరణాల సంఖ్య రీత్యా ఇది రాష్ట్రంలోనే అత్యంత ప్రమాదకరమైన 20వ ప్రాంతంగా ఉందని, వెంటనే ఇక్కడ నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మలుపుల వద్ద రేడియం సిగ్నల్స్, ప్రమాద హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటులో ఏమాత్రం నిర్లక్ష్యం వహించకూడదని స్పష్టం చేశారు. వాహనదారులు కూడా నిబంధనలు పాటించి ప్రాణాలు కాపాడుకోవాలని కోరారు. మరిన్ని ప్రాణాలు పోకముందే అధికార యంత్రాంగం మేల్కొని, ఈ 'బ్లాక్ స్పాట్'లో శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

# క్రీడలు.. మనోధైర్యానికి చిరునామా : ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

**- భీంగల్‌లో వైభవంగా 69వ ఎస్.జి.ఎఫ్ క్రీడోత్సవం**

**- క్రీడాజ్యోతిని వెలిగించిన ఎమ్మెల్యే**



**నిజామాబాద్, డిసెంబర్ 20 (డీడీ9 వార్త) :** క్రీడలు కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదు.. అవి జీవితంలో ఎదురయ్యే ఒడిదొడుకులను తట్టుకునే మానసిక స్థైర్యాన్ని ఇస్తాయి. గెలుపోటములను సమానంగా స్వీకరించినప్పుడే విద్యార్థుల్లో నిజమైన స్పోర్టింగ్ స్పిరిట్ అలవడుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. భీంగల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన 69వ ఎస్.జి.ఎఫ్ అంతర పాఠశాల క్రీడా పోటీలను ఆయన శనివారం ఘనంగా ప్రారంభించారు. క్రీడా జ్యోతిని వెలిగించి విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండల స్థాయి పోటీలను ఉపాధ్యాయులు, పీఈటీలు సమన్వయంతో ఒక ఇంటి పండుగలా నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రస్తుత కాలంలో డబ్బు ఉంటే పెళ్లి చేయడం సులభం కావొచ్చు కానీ, అందరినీ ఏకతాటిపైకి తెచ్చి క్రీడలు నిర్వహించడం చాలా కష్టమైన పని. విద్యాసాగర్ రెడ్డి, రాజ్ కుమార్, మల్లేష్ లాంటి క్రీడా ప్రేమికుల చొరవ వల్లే గ్రామీణ క్రీడలు నేటికీ సజీవంగా ఉన్నాయని కొనియాడారు. మా కుటుంబంలో నేను, మా తండ్రి, నా చెల్లెలు అందరం జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొన్న వాళ్లమే. నిత్యం ఆటలు ఆడటం వల్ల శరీరంలో రక్త ప్రసరణ మెరుగుపడి మెదడు చురుగ్గా పని చేస్తుంది. నేటి తరం యువత క్రీడలకు దూరమవ్వడం వల్లే గంజాయి వంటి మహమ్మారుల బారిన పడి పెడత్రోవ పడుతున్నారు అని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుతో పాటు క్రీడల్లో కూడా ప్రోత్సహించాలని కోరారు. గ్రామీణ స్థాయి నుంచి ఎదిగి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో భీంగల్‌లో జాతీయ స్థాయి క్రీడలు నిర్వహిస్తే తన వంతు సంపూర్ణ సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం మార్చ్ ఫాస్ట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటోలు అందజేసి అభినందించారు.

## పూలే స్ఫూర్తితో మహిళా ఉపాధ్యాయులకు గుర్తింపు : అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



**నిజామాబాద్, డిసెంబర్ 20 (డీడీ9 వార్త) :** దేశంలో అక్షర జ్యోతిని వెలిగించిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే స్ఫూర్తిని చాటుతూ, మహిళా ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేయడం గర్వకారణమని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా కొనియాడారు. బీసీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో జనవరి 10న నిర్వహించనున్న 'సావిత్రిబాయి పూలే పురస్కారాల' కరపత్రాలను శనివారం తన కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత పదేళ్లుగా మహిళా ఉద్యోగ, ఉపాధ్యాయినులను గుర్తించి ఈ అవార్డులను అందజేస్తున్న సంఘం కృషిని అభినందించారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడు మాడవేడి వినోద్ కుమార్ మాట్లాడుతూ.. సావిత్రిబాయి పూలే జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాల్లో పాఠ్యాంశంగా చేర్చే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ ఉపాధ్యాయ సంఘం జిల్లా నేతలు ఎ.మోహన్, కైరంకొండ బాబు, కొట్టాల రామకృష్ణ, డి.రాజు, రమణ స్వామి, గంగోనె సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కబడ్డీ విజేతగా చౌట్ పల్లి జెడ్పీహెచ్ఎస్

**- రాష్ట్రస్థాయికి ఎంపికైన కబడ్డీ జట్టు**





**నిజామాబాద్, డిసెంబర్ 20 (డీడీ9 వార్త) :** కమ్మర్ పల్లి మండలం చౌట్ పల్లి గ్రామ పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడారంగంతో పాటు విద్యా రంగంలోనూ తమ సత్తా చాటుతూ పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. శనివారం జిల్లా స్థాయిలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో చౌట్ పల్లి పాఠశాల జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. మొత్తం 40 జట్లు పాల్గొన్న ఈ టోర్నమెంట్‌లో చౌటుపల్లి విద్యార్థులు అద్భుతమైన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి జిల్లా విజేతగా నిలిచారు. ఈ విజయంతో ఈ జట్టు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించే అర్హత సాధించింది. విజేతలకు శిక్షణనిచ్చిన పీడీ నగేష్‌ను ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది. గణితంలోనూ మేటి. మరో వైపు మండల స్థాయిలో నిర్వహించిన 'గణిత ప్రతిభా పరీక్ష' లోనూ చౌటుపల్లి విద్యార్థులు మెరిశారు. ఈ పరీక్షలో మొదటి మూడు ర్యాంకులను ఈ పాఠశాల విద్యార్థులే దక్కించుకోవడం విశేషం. విద్యార్థులను ఈ స్థాయికి తీర్చిదిద్దిన గణిత ఉపాధ్యా యులు ఎ. శ్రీనివాస్, జి. ప్రవళికలను ప్రధానోపాధ్యాయులు ప్రశంసించారు. క్రీడలు, విద్యలో రాణిస్తున్న విద్యార్థులను ఉద్దేశి ంచి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.ఆంధ్రయ్య మాట్లాడుతూ.. కష్టపడితే ఫలితం దక్కుతుందని విద్యార్థులు నిరూపించారని హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ విద్యార్థులు రాణించి పాఠశాల పేరు నిలబెట్టాలని ఆయన ఆకాంక్షించారు.

## మున్సిపల్ పన్నుల వేట.. ప్రత్యేక డ్రైవ్ షురూ



**బోధన్, నిజామాబాద్ జిల్లా డిసెంబర్ 20 (డీడీ9 వార్త) :** బోధన్ పట్టణ ఖజానా నింపేందుకు మున్సిపల్ అధికారులు రంగంలోకి దిగారు. ఆస్తి పన్ను వసూళ్ల కోసం ప్రత్యేకంగా డ్రైవ్ నిర్వహిస్తూ ఇంటింటి గడప తొక్కుతున్నారు. శనివారం నిర్వహించిన తనిఖీల్లో మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ స్వయంగా పాల్గొని పన్ను వసూళ్లను పర్యవేక్షించారు. మున్సిపల్ సిబ్బంది బృందాలుగా విడిపోయి బకాయిదారుల నుంచి రూ. 2 లక్షల 10 వేలు వసూలు చేశారు. పన్నులు చెల్లించని వారికి నోటీసులు జారీ చేస్తామని, పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని పట్టణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# కార్యకర్తలే భారతీయ జనతా పార్టీకి పట్టుకొమ్మలు



**బోధన్, నిజామాబాద్ జిల్లా డిసెంబర్ 20 (డీడీ9 వార్త) :** రెంజల్ మండల బీజేపీలో సరికొత్త ఉత్సాహం నెలకొంది. మండలంలోని బొర్గం గ్రామం శనివారం బీజేపీ ఆత్మీయ సమ్మేళనానికి వేదికైంది. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డీ మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో ప్రజా పక్షాన పోరాటాలు చేస్తూ, పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. విజయకేతనం ఎగురవేసిన నూతన సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు అభినందనలు తెలుపుతూ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. పదవులు బాధ్యతతో కూడుకున్నవని, ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా పనిచేయాలని హితవు పలికారు. అధికార పార్టీ వైఫల్యాలను ఎండగట్టడంలో కార్యకర్తలు చురుకైన పాత్ర పోషించాలని కోరారు. ఆత్మీయంగా సాగిన ఈ భేటీలో నాయకులు, కార్యకర్తలు తమ తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, మేక సంతోష్, ఈర్ల రాజు, సుక్కరాజు, గోపి కృష్ణ, అజయ్, లక్ష్మణ్ తదితర ముఖ్య నేతలు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## సాలూర సర్కారు బడిలో వంటల పండుగ



**బోధన్, నిజామాబాద్ జిల్లా డిసెంబర్ 20 (డీడీ9 వార్త) :** విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు సాలూర మండల కేంద్రంలోని ఎంపీయూపీఎస్ ఉర్దూ మీడియం పాఠశాల వేదికైంది. శనివారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన 'ఫుడ్ ఫెస్టివల్' (వంటల ప్రదర్శన) సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. విద్యార్థులు తమ ఇళ్ల నుంచి రకరకాల వంటకాలను సిద్ధం చేసుకువచ్చి ప్రదర్శించారు. విద్యార్థులు స్వయంగా వడ్డించిన ఈ వంటకాలను వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు రుచి చూసి చిన్నారుల ప్రతిభను అభినందించారు. పుస్తక జ్ఞానంతో పాటు ఇలాంటి సృజనాత్మక కార్యక్రమాలు పిల్లల సర్వతోముఖాభివృద్ధికి దోహదపడతాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల , విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## వ్యసనాల బాట వద్దు.. విద్యతోనే 'బంగారు' భవిష్యత్త

**- భీమ్‌గల్ ఎస్సై సందీప్ పిలుపు**




**నిజామాబాద్, డిసెంబర్ 20 (డీడీ9 వార్త) :** చదువుకోవాల్సిన వయసులో తప్పుడు దారి పట్టకండి.. మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దు అని భీమ్‌గల్ ఎస్సై సందీప్ విద్యార్థులకు హితవు పలికారు. శనివారం భీమ్‌గల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలీస్ కళాబృందం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. యువతను వేధిస్తున్న గంజాయి, మద్యం మహమ్మారికి దూరంగా ఉండాలని కోరారు. ఏఆర్ ఎస్సై శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై ఏకాగ్రత వహించాలని, స్మార్ట్ ఫోన్ల వినియోగంలో జాగ్రత్తగా ఉండాలని, సైబర్ మోసాల బారిన పడకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాబృందం సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## క్రీడల్లో రాణించండి.. కేజీబీవీ విద్యార్థినులకు 'నాగేంద్ర యువసేన' భరోసా



**నిజామాబాద్, డిసెంబర్ 20 (డీడీ9 వార్త) :** భీమ్‌గల్ స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులకు నాగేంద్ర యువసేన అండగా నిలిచింది. మండల కేంద్రంలో శనివారం నిర్వహిస్తున్న అర్బన్ మండల స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థినులకు యువసేన సభ్యులు ఉచితంగా క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, క్రీడలు శారీరక దృఢత్వానికే కాకుండా మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని సూచించారు. ఆపన్న హస్తం అందించిన యువసేన సభ్యులకు పాఠశాల ఎస్ఓ అనురాధ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నిచ్చేమొల్ల మహేష్, సయ్యద్ రెహమాన్, సుంకరి సురేష్, వంశీకృష్ణ, సంపత్, శివ బాలాజీ, శివ తదితర యువసేన సభ్యులు పాల్గొన్నారు.

## గణితంలో 'రెంజల్' విద్యార్థుల ప్రతిభ జిల్లా స్థాయికి ఆరుగురు ఎంపిక



**బోధన్, నిజామాబాద్ జిల్లా డిసెంబర్ 20 (డీడీ9 వార్త) :** గణితం అంటే భయం కాదు.. అది ఒక ఇష్టమని రెంజల్ మండల విద్యార్థులు నిరూపించారు. శనివారం స్థానిక జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో తెలంగాణ గణిత ఫోరమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి ప్రతిభ పరీక్షలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంఈఓ ఆంజనేయులు మాట్లాడుతూ.. నిత్యజీవితంలో గణితం ఒక భాగమని, ఇందులో రాణించిన వారు ఏ రంగంలోనైనా విజయం సాధిస్తారని భరోసా ఇచ్చారు. జిల్లా స్థాయికి అర్హత సాధించిన వారు: తెలుగు మీడియం విభాగంలో అర్చన (తాడ్బిలోలి), నికిత (నీలా), మాధవి (నీలా) టాప్-3లో నిలవగా.. ఇంగ్లీష్ మీడియంలో గౌతమి (రెంజల్), కృపవేణి (నీలా), ధనశ్రీ (కేజీబీవీ రెంజల్) తమ ప్రతిభను చాటారు. వీరంతా త్వరలో జరగనున్న జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంఈఓ తెలిపారు. గణిత ఫోరమ్ నాయకులు అరుణ్ కుమార్, ప్రవీణ్ తదితరులు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

## న్యాయ వివాదాలకు రాజీ మార్గం... జాతీయ లోక్ అదాలత్ : జిల్లా ప్రధాన న్యాయమూర్తి భరత లక్ష్మి

**- నేడే జాతీయ లోక్ అదాలత్**

**- 15 ప్రత్యేక బెంచ్‌ల ఏర్పాటు**



**నిజామాబాద్, డిసెంబర్ 20 (డీడీ9 వార్త) :** ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతూ, మానసిక, ఆర్థిక ఇబ్బందులు పడుతున్న కక్షిదారులకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా జిల్లాలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 10:30 గంటల నుంచి జిల్లా వ్యాప్తంగా ఉన్న కోర్టు సముదాయాల్లో ఈ ప్రక్రియ ప్రారంభం కానుంది. శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి భరత లక్ష్మి ఈ ఏర్పాట్లను పర్యవేక్షించి కక్షిదారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజీపడదగ్గ సివిల్, క్రిమినల్, మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు, బ్యాంకు బకాయిలు, కుటుంబ తగాదాలు వంటి సమస్యలను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కేసుల విచారణ కోసం నిజామాబాద్‌లో 9, బోధన్‌లో 4, ఆర్మూర్‌లో 2 ప్రత్యేక బెంచ్‌లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ విధానం ద్వారా సమయం, ధనం ఆదా అవ్వడమే కాకుండా, ఉభయ పక్షాల మధ్య సత్సంబంధాలు నెలకొంటాయని ఆమె పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లో ఇచ్చే తీర్పు తుది తీర్పు అని, దీనిపై మళ్లీ అప్పీలుకు వెళ్లే అవకాశం ఉండదని గుర్తుచేశారు. జిల్లా సీనియర్ సివిల్ జడ్జి సాయిసుధ మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారానికి ఉన్న సువర్ణావకాశాన్ని కక్షిదారులు వదులుకోవద్దని కోరారు.

## ఏఆర్‌పీ క్యాంప్ పాఠశాలలో ఘనంగా గణిత ప్రదర్శన

**బోధన్, నిజామాబాద్ జిల్లా డిసెంబర్ 20 (డీడీ9 వార్త) :** విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఎడపల్లి మండలం ఏఆర్‌పీ క్యాంప్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికైంది. శనివారం పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన 'గణిత మేళా' విద్యార్థుల ప్రతిభకు అద్దం పట్టింది. 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు గణితంలోని క్లిష్టమైన సూత్రాలను సైతం ఆటపాటల ద్వారా సులభమైన పద్ధతుల్లో వివరించి అందరినీ ఆశ్చర్యపరిచారు. జ్యామితి, బీజగణితం వంటి కఠినమైన అంశాలను కళ్లకు కట్టేలా నమూనాలను ప్రదర్శించారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. నిత్యజీవితంలో గణితం ప్రాధాన్యతను వివరించేలా విద్యార్థులు చేసిన ప్రయోగాలు మేళాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

## రేపటి నుంచి యథావిధిగా 'ప్రజావాణి' : జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



**నిజామాబాద్, డిసెంబర్ 20 (డీడీ9 వార్త) :** నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే 'ప్రజావాణి' కార్యక్రమం తిరిగి ప్రారంభం కానుంది. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో తాత్కాలికంగా నిలిపివేసిన ఈ వినతుల స్వీకరణ కార్యక్రమాన్ని ఈ నెల 22 నుంచి యథావిధిగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పూర్తి కావడంతో, ప్రజల సమస్యల సత్వర పరిష్కారం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే బాధితులు, అర్జీదారులు సోమవారం ఉదయం కలెక్టరేట్‌కు వచ్చి తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లవచ్చని సూచించారు.

# వెన్నులో వణుకు పుట్టించేలా ఈషా

## 25న వస్తోన్న థ్రిల్లర్




త్రిగుణ్, హెబ్బాపటేల్ కీలక పాత్రల్లో రానున్న హారర్ థ్రిల్లర్ 'ఈషా'. శ్రీనివాస్ మన్నె దర్శకుడు. ఆ హారర్ థ్రిల్లర్ డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో విడుదలకు మందు ఆసక్తికరమైన వీడియోను టీమ్ పంచుకుంది. ఆత్మ అంటే అదేనేమో అంటూ హీరోయిన్ చెప్పే డైలాగు భయపెట్టేలా ఉంది. ఇటీవల 'లిటిల్ హార్ట్స్', 'రాజు వెడ్స్ రాంబాయి' వంటి వరుస కల్ట్ హిట్స్ అందించిన సక్సెస్‌ఫుల్ జోడీ బన్నీ వాస్, వంశీ నందిపాటి. కలిసి ఇప్పుడు ప్రేక్షకులకు ఒక క్రేజీ హారర్ అనుభూతిని పంచడానికి సిద్ధమయ్యారు. వీరి సరికొత్త హారర్ థ్రిల్లర్ 'ఈషా' డిసెంబర్ 25న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కాబోతోంది. ఈ చిత్రం గురించి మేకర్స్ తాజాగా 'వార్నింగ్ వీడియో' పేరిట ఒక ఆసక్తికరమైన వీడియోను విడుదల చేశారు. సాధారణంగా హారర్ సినిమాలకు ట్రైలర్లు రావడం సహజం, కానీ ఇలా ప్రత్యేకంగా హెచ్చరిక వీడియో రావడం హారర్ జానర్‌లోనే ఇదే తొలిసారి. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఆత్మలు, దెయ్యాలు లేవని బలంగా నమ్మే కొందరు స్నేహితుల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. సమాజంలోని మూఢనమ్మకాలను, దొంగ బాబాలను ఎండగట్టాలని వారు భావిస్తారు. ఈ క్రమంలో వారికి పృథ్వీరాజ్ (బబ్లూ) నుంచి ఒక సవాలు ఎదురవుతుంది. 'ఆత్మలు ఉన్నాయని నిరూపిస్తే..?' అంటూ ఆయన విసిరే ఛాలెంజ్‌తో ఈ స్నేహితుల బృందం ఒక చీకటి ప్రపంచంలోకి అడుగుపెడుతుంది. మనుషుల్లాగే కొన్ని స్థలాలు కూడా పుట్టుకతోనే శాపగ్రస్తమై ఉంటాయి.. కాలక్రమేణా అవి ఆత్మలకు నిలయాలుగా మారుతాయని దర్శకుడు శ్రీనివాస్ మన్నె ఇచ్చిన వార్నింగ్ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని పెంచుతోంది. ట్రైలర్ మరియు ఈ వార్నింగ్ వీడియోలో కనిపించిన విజువల్స్ భయానకంగా ఉన్నాయి. ముఖ్యంగా పాడుబడిన బంగ్లా, క్షుద్ర పూజల సెటప్, బ్లూ అండ్ డార్క్ థీమ్ విజువల్స్ వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి.సంతోష్ లైటింగ్, ధ్రువన్ అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ సినిమాలోని భయాన్ని రెట్టింపు చేస్తున్నాయి. ఈ చిత్రంలో ఉండే సడన్ ట్విస్ట్‌లు చూసి భయపడే అవకాశం ఉన్నందున, గుండె బలహీనంగా ఉన్నవారు ఈ సినిమా చూడకూడదని చిత్ర బృందం స్పష్టం చేసింది. ఇందులో త్రిగుణ్, అఖిల్ రాజ్ హీరోలుగా నటించగా, హెబ్బా పటేల్ హీరోయిన్‌గా నటించింది. సిరి హనుమంతు, బబ్లూ, పృథ్వీరాజ్ ఇతర కీలక పాత్రలు పోషించారు. డిసెంబర్ 25న విడుదల కానున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ప్రకంపనలు సృష్టిస్తుందో చూడాలి.

# మళయాల దర్శకుడు, నటుడు శ్రీనివాసన్ కన్నుమూత



మలయాళ చిత్ర పరిశ్రమలో తీవ్ర విషాదం నెలకొంది. ప్రముఖ సీనియర్ నటుడు, దర్శకుడు, స్క్రీన్ ప్లే రచయిత శ్రీనివాసన్ కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస విడిచారు. నటుడిగా, దర్శకుడిగా, కథా రచయితగా ఐదు దశాబ్దాల పాటు కేరళ చిత్ర పరిశ్రమకు ఆయన సేవలు అందించాడు. 'వడక్కునోక్కియంత్రం', 'చింతవిశిష్టాయ శ్యామల' వంటి చిత్రాలకు ఆయన దర్శకత్వం వహించడమే కాకుండా రాష్ట్ర, జాతీయ అవార్డులను కూడా అందుకున్నారు. శ్రీనివాసన్ ఇద్దరు కుమారులు వినీత్ శ్రీనివాసన్, ధ్యాన్ శ్రీనివాసన్ కూడా మలయాళ చిత్ర పరిశ్రమలో నటులుగా, దర్శకులుగా రాణిస్తున్నారు. శ్రీనివాసన్ మృతి పట్ల కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, నటులు మోహన్ లాల్, మమ్ముట్టి సహా పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

# సామాజిక సందేశంతో వస్తోన్న దండోరా




గ్రామీణ నేపథ్యంలో సాగే సందేశాత్మక చిత్రాలకు తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ బ్రహ్మరథం పడతారన్న విషయం తెలిసిందే. తాజాగా అదే కోవలో తెలంగాణ సంస్కృతి, సామాజిక అంశాల కలబోతగా వస్తున్న చిత్రం 'దండోరా'. మురళీకాంత్ దర్శకత్వంలో రవీంద్ర బెనర్జీ ముప్పానేని నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నైజాం ఏరియాలో విడుదల చేస్తుండటం సినిమాపై మరింత అంచనాలను పెంచింది. విదేశాల్లో కూడా ఈ సినిమా భారీ ఎత్తున విడుదల కానుంది. సుమారు 200కు పైగా థియేటర్లలో ప్రదర్శితం కాబోతున్న ఈ చిత్రానికి సంబంధించి, ఈ నెల 23నే అక్కడ ప్రీమియర్స్ పడనున్నాయి. అయితే ఈ సినిమా విడుదలకు ఇంకా వారం కూడా లేకపోవడంతో తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్.గ్రామాల్లో ఇంకా కులం అడ్డుగోడలు తొలగిపోలేదని ఈ ట్రైలర్ చూస్తుంటే అర్థమవుతుంది. ప్రారంభంలోనే ఊరి బయట శవాన్ని మోసుకెళ్తున్న దృశ్యాలు, 'మన చావు పుట్టుకలన్నీ ఈ ఊరి బయట రాసిండ్రా ఆ దేవుడు..' అనే డైలాగ్ ఈ సినిమాలో ఉన్న సామాజిక కోణాన్ని ఎత్తి చూపుతోంది. ఈ చిత్రంలో శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, మానికా చిక్కాల, మౌనికా రెడ్డి, బిందుమాధవి, రాధ్య, అదితి భావరాజు వంటి భారీ తారాగణం కీలక పాత్రలు పోషించారు. మార్క్ కె. రాబిన్ అందించిన సంగీతం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. తెలంగాణ మట్టి వాసనతో కూడిన కథలను ఇష్టపడే వారికి 'దండోరా' ఒక మంచి అనుభూతిని ఇస్తుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది.

--------------



# బిర్యానీ పాత్రలో సంపూర్ణేశ్ బాబు

నేచురల్ స్టార్ నాని, 'దసరా' ఫేమ్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న భారీ యాక్షన్ చిత్రం 'ది ప్యారడైజ్' నుంచి ఒక షాకింగ్ అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలో 'బర్నింగ్ స్టార్' సంపూర్ణేష్ బాబును ఒక సరికొత్త ఊర మాస్ అవతారంలో శ్రీకాంత్ ఓదెల చూపించబోతున్నాడు. ఎప్పుడూ తనదైన కామెడీతో నవ్వించే సంపూర్ణేష్ బాబును దర్శకుడు శ్రీకాంత్ ఓదెల పూర్తిగా మార్చేశాడు. 'ది ప్యారడైజ్' చిత్రంలో సంపూ 'బిర్యానీ' అనే మాస్ పాత్రను పోషిస్తున్నారు. శుక్రవారం విడుదలైన ఆయన ఫస్ట్ లుక్ పోస్టర్ ఇప్పుడు ఫిల్మ్ నగర్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ పోస్టర్‌లో సంపూర్ణేష్ బాబు ఒంటి నిండా రక్తపు మరకలతో, భుజాన గొడ్డలి వేసుకుని, బీడీ తాగుతూ చాలా సీరియస్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఆయన కళ్లలో కనిపిస్తున్న క్రూరత్వం చూస్తుంటే, ఇందులో ఆయన కేవలం కామెడీకి పరిమితం కాకుండా ఒక పవర్‌ఫుల్ పాత్ర చేస్తున్నట్లు అర్థమవుతోంది. ఈ చిత్రంలో హీరో నాని (జడల్) కి అత్యంత సన్నిహితుడైన స్నేహితుడిగా, ప్రాణమిచ్చే నమ్మకస్థుడిగా 'బిర్యానీ' పాత్ర ఉండబోతోంది. ఈ పాత్ర కోసం సంపూర్ణేష్ బాబు చాలా బరువు తగ్గి, తన బాడీ లాంగ్వేజ్‌ను కూడా పూర్తిగా మార్చుకున్నట్లు చిత్ర బృందం తెలిపింది.

ర్శకుడు శ్రీకాంత్ ఓదెల తన సినిమాల్లో పాత్రలను చాలా సహజంగా, గంభీరంగా చూపిస్తారు. 'దసరా'లో కమెడియన్లను కూడా సీరియస్ పాత్రల్లో చూపించినట్లుగానే, ఇప్పుడు సంపూ లోని యాక్షన్ యాంగిల్‌ను బయటకు తీయబోతున్నారు. 'హైదరాబాద్ నేపథ్యంలో సాగే కథలో 'బిర్యానీ' లేకుండా ఉండదు' అంటూ ఈ పాత్రను ఇంట్రడ్యూస్ చేసిన తీరు వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో నానితో పాటు, మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సోనాలి కులకర్ణి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా.. ఈ సినిమా 2026 మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా 8 భాషల్లో (తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్, స్పానిష్) గ్రాండ్‌గా విడుదల కానుంది.

# నెట్‌ప్లిక్స్‌లోకి వస్తోన్న ఆంధ్రా కింగ్ తాలూకా

రామ్ పోతినేని, భాగ్యశ్రీ బోర్సే ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలూకా'.. తెలుగు సినీ అభిమాని కథగా నవంబర్ 27న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. అయితే ఈ సినిమా విడుదలై నెల కూడా తిరక్కుండానే ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ప్లిక్స్‌లో డిసెంబర్ 25 నుంచి తెలుగు, హిందీ, తమిళ్, మలయాళం, కన్నడ భాషల్లో ఈ చిత్రం స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. విషయాన్ని తెలుపుతూ నెట్‌ప్లిక్స్ కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. మహేశ్‌బాబు.పి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో కన్నడ స్టార్ ఉపేంద్ర కీలక పాత్రలో నటించాడు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. సూర్య(ఉపేంద్ర) పేరుమోసిన సూపర్‌స్టార్. అశేషమైన అభిమానుల అతని సొంతం. అయితే.. తనకు బ్యాడ్ పిరియడ్ నడుస్తూ ఉంటుంది. విడుదలైన సినిమాలన్నీ ఎ÷-లాపులవుతుంటాయి. ఈ క్రమంలో సూర్య వందవ చిత్రం షూటింగ్ మధ్యలోనే ఆగిపోతుంది. చిత్రాన్ని నిర్మించలేనని నిర్మాత చేతులెత్తేస్తాడు. ఓ మూడు కోట్లు ఉంటే సినిమా పూర్తవుతుంది. ఆ మూడు కోట్ల కోసం సూర్య ప్రయత్నాలు మొదలుపెడతాడు. ఈ క్రమంలో ఓ నిర్మాతను డబ్బు అడుగుతాడు.




# పవన్‌తో నటించడం ఒక గౌరవం: రాశీ ఖన్నా

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా, దర్శకుడు హరీశ్ శంకర్ తెరకెక్కిస్తున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఉస్తాద్ భగత్ సింగ్'. ఈ సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్న నటి రాశీ ఖన్నా, తాజాగా షూటింగ్ సెట్స్ నుంచి కొన్ని ఆసక్తికరమైన బీటీఎస్ (బిహైండ్ ది సీన్స్) వీడియోలను అభిమానులతో పంచుకున్నారు.తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఈ వీడియోలను షేర్ చేసిన రాశీ ఖన్నా, "యాక్షన్ మరియు కట్ మధ్య నిశ్శబ్దం ఉంటుంది. కొన్నిసార్లు నవ్వులు కూడా ఉంటాయి" అంటూ దర్శకుడు హరీశ్ శంకర్‌ను ట్యాగ్ చేశారు. ఈ వీడియోలను చూస్తే, ఆమె షూటింగ్‌ను ఎంతో ఆస్వాదిస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.గతంలో కూడా పవన్ కల్యాణ్‌తో కలిసి పనిచేయడం ఒక గౌరవంగా భావిస్తున్నానని రాశీ పేర్కొన్న విషయం తెలిసిందే. ఆయనతో దిగిన ఒక సెల్ఫీని పంచుకుంటూ, ఈ సినిమా తనకు ఎప్పటికీ గుర్తుండిపోయే మధుర జ్ఞాపకం అని ఆమె తెలిపారు. 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంలో రాశీ 'శ్లోక' అనే ముఖ్యమైన పాత్రలో నటిస్తున్నట్లు చిత్రబృందం గతంలో ప్రకటించింది.మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రీలీల మరో కథానాయికగా నటిస్తోంది.

